క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

కళ్యాణదుర్గం: హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పోస్టర్లను వైద్య సిబ్బంది విడుదల చేశారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించింది. మెడికల్ ఆఫీసర్ ప్రసన్న భారతి, రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ వైద్య సిబ్బందితో కలిసి అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఐసీటీసీ కౌన్సిలర్ నారాయణ, స్టాఫ్ నర్సు సుగుణ పాల్గొన్నారు.

టీకా కార్యక్రమంపై అలసత్వం తగదు



మరుట్ల-1వ కాలనీలో ఆవుకు టీకా వేస్తున్న జేడీ వెంకటస్వామి

కూడేరు: గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంపై అలసత్వం తగదని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) వెంకటస్వామి సిబ్బందిని ఆదేశించారు. మరుట్ల-1వ కాలనీలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని జేడీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీ ఉపేంద్ర, సీనియర్ పారా వెట్ రంగారెడ్డి, వీహెచ్ఏలు యశోద, రఘు వర్ధన్, గోపాల్ మిత్ర రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి

కూడేరు: మండల పరిధిలోని 14 పంచాయతీల కార్యదర్శులు ఎంపీడీఓ కుళ్లాయి స్వామిని గురువారం కలిసి పనిభారం తగ్గించాలని కోరారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలను సచివాలయ ఉద్యోగులతో చేయించడం, తడిచెత్త, పొడి చెత్తసేకరణ, పారిశుధ్యం మెరుగు, పంచాయతీ పోర్టల్ సేవలు, ఇతర పనులు పంచాయతీ కార్యదర్శులపై మోయలేని భారమవుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, పావని రెడ్డి, సుభాషిణి, హరి, పరమేష్, మల్లికార్జునతో పాటు పలువురు కార్యదర్శులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మిద్దెతోటలు పెంచాలి



శిక్షణా తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి కనబర్చాలని ఆత్మ పీడీ మద్దిలేటి పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆత్మ పీడీ మాట్లాడుతూ మిద్దె తోటలతో స్వచ్ఛమైన ఆకుకూరలు, కాయగూరలు సాగు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మజ మాట్లాడారు. ఇళ్లపై ఆకుకూరలు, కాయగూరలు సాగు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓలు శుభకర్, మధుకర్, పెన్నయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

కణేకల్లు: మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కణేకల్లులోని బస్టాండ్‌కెళ్లే మెయిన్‌రోడ్డులో ఖాజా డాక్టర్ కాంపౌండ్ ఎదురుగా 11 కేవీ లైన్ ఉంది. ఈ లైన్ కింద ఉన్న రస్తా పోరంబోకు స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవల కొనుగోలు చేశాడు. ఈ స్థలంలో ఓ బంకు ఏర్పాటు చేసి అద్దెకివ్వాలని సదరు వ్యక్తి నిర్ణయించాడు. ఎత్తులో బంకు ఏర్పాటు చేస్తే 11 కేవీ విద్యుత్‌లైన్ తగులుతోందని భావించిన ఆ వ్యక్తి.. ఏకంగా విద్యుత్ లైన్ మార్పించేశాడు. ఇందుకు విద్యుత్ అధికారులను ఆశ్రయించి రూ.40 వేలు లంచం ఇచ్చినట్లు సమాచారం. డబ్బు తీసుకున్న అధికారులు.. ఆగమేఘాలపై మెయిన్‌రోడ్డు పక్కనే ఇరువైపులా రెండు విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. అంతేకాక విద్యుత్ స్తంభానికి వైర్లు తగిలించడానికి బిగించిన యాంగ్లర్లు రోడ్డుపై మళ్లించారు. ఈవిషయంపై ఏఈఈ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రోడ్డు పక్కన పాతిన స్తంభాలపై ఫిర్యాదు అందాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కూడా ఉంటుందని, తాను లేనప్పుడు ఈ పని చేశారని, రోడ్డు పక్కన పాతిన స్తంభాలను తొలగించేస్తామన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరులోని శర్మాస్ హుసేనీ దర్గా ఆలయ పరిసరాల్లో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గురువారం రాత్రి దుండగుడు అపహరించుకెళ్లాడు. ఉరవకొండ మండలం రాయాపురానికి చెందిన వన్నూరు స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆగిన హంద్రీనీవా నీరు..

అన్నదాతల్లో ఆందోళన

- మిర్చి, వేరుశనగ పంటలపై తీవ్ర ప్రభావం
- 5 వేల ఎకరాల్లో నీరు లేక ఎండుతున్న పంటలు
- మరో తడి నీరు అందించాలని కోరుతున్న రైతులు

ఉరవకొండ: హంద్రీనీవా నీరు ఆగిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. హంద్రీనీవాకు నీటి సరఫరా ఈనెలాఖరు వరకు వస్తుందన్న నమ్మకంతో రైతులు మిర్చి, వేరుశనగ పంటలు సాగు చేశారు.. తీరా అధికారులు నాలుగు రోజుల క్రితం నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వేరుశనగ పంటకు నీటి తడి అందక ఇప్పటికే ఎండుముఖం పట్టింది. దీంతో పాటు కాయ నాణ్యత లోపించి దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీనీవాకు గత ఆగస్టు 1న మాల్యాల పంప్‌హౌస్ వద్ద నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. దాదాపు 1,200 క్యూసెక్కుల స్థాయిలో 215 రోజుల పాటు డ్యాం నుంచి వాటర్ లిఫ్టింగ్ నిర్వహించారు. హంద్రీనీవా కింద నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, బెళుగుప్ప మండలాల్లో రబీ కింద 5 వేల ఎకరాల్లో మిర్చి, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఇందులో బెళుగుప్పలో 2 వేలు, వజ్రకరూరులో 2 వేలు, ఉరవకొండ వెయ్యి ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

మిర్చి, వేరుశనగ పంటకు తీవ్ర నష్టం

హంద్రీనీవాకు నీటి సరఫరా ఈనెలాఖరు వరకు వస్తుందన్న నమ్మకంతో రైతులు మిర్చి, వేరుశనగ పంటలు సాగు చేశారు. తీరా అధికారులు నాలుగు రోజుల క్రితం నీటి సరఫరాను నిలిపివేయడంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వేరుశనగ పంటకు మరో తడి నీరు అందకపోవడంతో ఇప్పటికే ఎండుముఖం పట్టింది. దీంతో పాటు కాయ నాణ్యత లోపించి దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని రైతులు వాపోతున్నారు. మిర్చి పంటకు ఎకరాకు రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి రైతులు మరో వారం రోజుల్లో పంట చేతికందుతున్న తరుణంలో కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు రూ.లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



వజ్రకరూరు వద్ద హంద్రీనీవా కాలువ కింద నీరు లేక ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట



హంద్రీనీవా కాలువ

వైఎస్సార్‌సీపీ హయాంలో సమృద్ధిగా నీరు..

వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో హంద్రీనీవాకు సమృద్ధిగా నీటిని అందించారు. దీంతో ఆయకట్టు భూములు పంటలతో కళకళలాడాయి. చెరువులకు నీరు అందడటంతో భూగర్భ జలాలు పెరిగాయి. నియోజకవర్గంలో చెరువులన్నింటికీ హంద్రీనీవా నీటిని అందించడంతో గ్రామాల్లో ఎలాంటి దుర్భిక్షం కనిపించలేదు.

పంట దిగుబడిపై ప్రభావం..



హంద్రీనీవా నీటిని నమ్ముకోని వేరుశనగ సాగుచేస్తే కాలువకు ఒక్కసారిగా నీటి ప్రవాహం ఆగిపోయింది. మరో తడి నీరు అందిస్తే పంట చేతికందే పరిస్థితి ఉండేది. మూడు ఎకరాల్లో పంట ఎండు ముఖం పట్టింది. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

– గోపాల్, కమలపాడు, రైతు

ఒక్క తడి అందింతే పంట చేతికొస్తుంది



ఐదెకరాల్లో మిర్చి పంట సాగు చేసి మరో తడి నీటిని పంటకు అందింతే మిర్చి చేతికందుతుంది. హంద్రీనీవాకు ఎలాంటి ప్రకటన లేకుండా నీటిని నిలిపివేయడంతో మా పంటల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఎకరాలకు రూ.2 లక్షలు పెట్టుబడులు పెట్టాం. నా పరిస్థితి అర్థం కావడం లేదు.

– వెంకటరెడ్డి, రాగులపాడు, రైతు

వేరుశనగ దిగుబడిపై ప్రభావం



హంద్రీనీవాకు సాగునీరు నాలుగు రోజులుగా ఆగిపోయింది. దీంతో వేరుశనగ పంటపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే కాయ సైజు పూర్తిగా తగ్గి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం మరో తడి నీటిని అందిస్తే పంట చేతికంది అప్పుల పాలు కాకుండా ఉంటాం.

– తిప్పేస్వామినాయక్, బెళుగుప్పతండా

భవిష్యత్తు మనదే ..బాధ్యతగా పనిచేయండి



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో మెట్టు విశ్వ

రాయదుర్గం: భవిష్యత్తు మనదే.. మరింత బాధ్యతగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయదుర్గం యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డికి సూచించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మెట్టు విశ్వనాథ్‌రెడ్డి కలిశారు. స్థానిక రాజకీయ పరిణామాలపై చర్చించారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని, యువతను ఆకట్టుకుని ముందుకెళ్లాలంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని మెట్టు విశ్వ తెలిపారు. రాయదుర్గంలో కొందరు మెట్టు ఫ్యామిలీపై బట్ట పాములు వదులుతున్నారని, అలాంటి వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఏప్రిల్ నుంచి రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వంలో పర్యటిస్తామన్నారు.

'సాయంకాలం' ఎడిటర్‌పై చర్యలు తీసుకోండి



అర్బన్ పీఎస్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డితో పాటు పార్టీ మండల కన్వీనర్లే లక్ష్యంగా చేసుకొని నిరాధార వార్తలు ప్రచురిస్తున్న కడప సాయంకాలం పత్రిక ఎడిటర్ వెంకటరెడ్డిపై అర్బన్ పీఎస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అడ్వొకేట్ వెంకటరెడ్డితో కలసి వైఎస్సార్‌సీపీ పట్టణ, రాయదుర్గం, డి హీరేహాళ్ మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రాయంపల్లి రామాంజినేయులు, గొడిశెలపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకుడు నియోజవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, నియోజకవర్గం బూత్ కన్వీనర్ అంజిరెడ్డి తదితరులు తప్పుడు వార్తలు ప్రచురించిన క్లిప్పింగ్‌లు జత చేస్తూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఏ చిన్న ఆధారం లేకుండా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మెట్టు గోవిందరెడ్డిపై కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. సాయంకాలం పీడీఎఫ్ పేపర్ నిర్వాహకుడికి రాయదుర్గంలో జరిగే విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే రాయదుర్గంలో అలజడి సృష్టించాలని చూసే వెంకటరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. మెట్టు గోవిందరెడ్డి వయసుతో సంబంధం లేకుండా కొందరు వ్యవహరిస్తున్న తీరుపై ఖండించినందుకే తనపై సాయంకాలం పత్రికలో తప్పుడు వార్త రాయించారని పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు మండిపడ్డారు. సీఐ, ఎస్ఐ పీఎస్‌లో అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి ఫిర్యాదు కాపీ అందించారు.

మెట్టుపై అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేదిలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్లు వేమన, కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్కే బద్రీ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు డి.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.మెట్టు గోవిందరెడ్డి నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఏపీ ఐడీసీ చైర్మన్‌హోదాలో ఆయన దోచుకున్నారని, పార్టీ అధికారంలో రాకపోవడంతో వైఎస్సార్‌సీపీ వీడి జనసేనలో వెళ్తున్నారంటూ అపరిచిత వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ చీప్ ట్రిక్స్ ఎవరు చేస్తున్నారో? అతని వ్యక్తిత్వం ఏంటో? అతని బుద్ధి ఎలాంటిదో నియోజకవర్గ ప్రజలకు తెలుసునన్నారు. ఎన్నికల్లో డబ్బు పోగొట్టుకొని ప్రతి కార్యకర్తతో బాధపడుతున్నాడంటూ మెట్టు పట్ల దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఓడిపోయినా ఆయన నిత్యం కార్యకర్తలు, ప్రజల మధ్య ఉంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లి నాగరాజు, నేసే రఘు, గోపాల్, సర్మాస్, సుధారెడ్డి, రామకృష్ణ, హరి పాల్గొన్నారు.

మాధవ కృష్ణారెడ్డి మృతి తీరనిలోటు



పాలికిలో మాధవ కృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

విడపనకల్లు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎల్.మాధవ కృష్ణారెడ్డి (60)కి మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. పాలికి గ్రామానికి చెందిన మాధవ కృష్ణారెడ్డి గురువారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులను పరామర్శించి, కృష్ణారెడ్డి కుమారుడు మనోవిశ్వాస్‌రెడ్డిని ఓదార్చారు. మాధవ కృష్ణారెడ్డి 2021–17 సంవత్సరం వరకు గ్రామ సర్పంచుగా అనేక మంచి సేవలు అందించడమే కాకుండా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బెస్త రమణ,సీపీ వీరన్న, చిన్న వెంకటేశులు, పెద్ద వెంకటేశులు, నాగిరెడ్డి, వరదారెడ్డి,గోవిందరెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, వజ్రకరూర్ మండలం చాబాల సర్పంచు మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, యూత్ నాయకులు గోవర్ధనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వెంకట్రామప్ప కుటుంబ సభ్యులకు పరామర్శ : వారం రోజుల కిందట గాజుల వెంకట్రామప్ప మృతిచెందాడు. కుటుంబ సభ్యులను వై. విశ్వేశ్వరరెడ్డి పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఈకార్యక్రమంలో భార్గవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటలపాటలతో విద్యాబుద్ధులు నేర్పాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. గురువారం జల్లిపల్లి హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ' నవచేతన ఆధార్ శీలా పోషణ బీ పడాయిబి' పై మూడు రోజు శిక్షణ ప్రారంభించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు.గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ నవచేతన, ఆధార్ శిలా గురించి ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, ఖాసీంబీ, ఓబుళమ్మ, అరుణ, సుధ, రామాంజినమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నవచేతన, ఆధార్‌శీలా కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఈనెల 22 వరకు మండలంలోని 61 కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయని సూపర్‌వైజర్‌లు సురేఖ, అరుణమ్మ తెలిపారు.

వికలాంగ పింఛన్ల పరిశీలన



పింఛనుదారుడితో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం: స్థానిక కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో పింఛన్ల పరిశీలనలో భాగంగా ఆర్థో విభాగంలో పింఛనుదారులకు వైకల్యంపై గురువారం పరీక్షలు చేశారు. కర్నూలుకు చెందిన ఆర్థో పెడిక్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వికలత్వంపై వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పింఛనుదారుల వయస్సు, వికలత్వం, సహజమా ? లేక ప్రమాదమా లాంటి వివరాలను పరిశీలించారు. వికలత్వం పరీక్షలకు కళ్యాణదుర్గం మండలంలో 50 మంది హాజరు కావాల్సి ఉండగా, 48 మంది హాజరయ్యారు. మొదటి రోజు బోరంపల్లి, గోళ్ల, మానిరేవు, కొత్తూరు, ముద్దినాయనపల్లి, బోయలపల్లి, ముద్దినాయనపల్లి గ్రామాల పింఛను దారులను పరిశీలించారు. వారంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం ద్వారా పింఛన్ల పరిశీలన జరుగుతుందని డాక్టర్ తెలిపారు.

రీసర్వే వివరాలు వెల్లడి

కూడేరు: భూరీసర్వే పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపికైన జయపురంలో రీసర్వే చురుగ్గా సాగుతోంది. 9,10,11,12 బ్లాక్స్‌లో రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చి రీసర్వే చేస్తున్నారు. గురువారం అధికారులు గ్రౌండ్ వాలిడేషన్‌ను రైతుల సమక్షంలో నిర్వహించి భూవివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, రీసర్వే ప్రసాద్, సర్వేయర్ అయేషా సిద్ధిఖి, వీర్వో గోపాల్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

కుందుర్పి: స్థానిక కెనరా బ్యాంకు కూడలిలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుతోపాటు 300 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి గురువారం మండల కేంద్రానికి వారపు సంతకు వచ్చే గ్రామీణ ప్రజలకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు బీసీ తిమ్మప్ప, బొమ్మయ్య, ఈరన్న, మంజునాథ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కంబదూరు : తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎరుకుల సేవా సంఘం మండల అధ్యక్షుడు ములకనూరు సుబ్బరాయుడు చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం బాలకిషన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు సత్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి

రాయదుర్గంటౌన్: తప్పుల్లేని ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని ఈఆర్ఓ ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ఇతరాత్ర అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈఆర్ఓతోపాటు తహశీల్దార్ నాగరాజు ఉన్నారు. ఈఆర్ఓ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాను అందరూ సరిచూసుకోవాలన్నారు.

అవకతవకలు జరిగితే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

రాయదుర్గంటౌన్: నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో అర్బన్, రూరల్ పరిధిలోని చౌకధాన్యపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన, కచ్చితమైన కొలతలతో నిత్యావసర సరుకులు పంపిణీ జరగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వందశాతం రేషన్ కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీకి స్టోరు డీలర్లు కూడా సహకరించాలని తహసీల్దార్ సూచించారు. ఈనెల 31లోపు ఈకేవైసీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ సుదర్శనాచారి, డీలర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విడపనకల్లు: కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరం 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తులసీప్రియ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు 6వ రతగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెత్త సేకరణ విధానంపై శిక్షణ

బొమ్మనహాళ్: చెత్త సేకరణ విధానం, తడిపొడి చెత్త సేకరణ, కంపోస్టు అంశాలపై అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని నేమకల్లులో బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు డీపీఆర్సీ రీసోర్స్ పర్సన్ సౌజన్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కంపోస్టు ఎలా చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ తడిపొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు ? హోటళ్లు, వ్యాపార సముదాయాల నుంచి సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించడం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు విజయభాస్కర్, దాసనాయక్, ఈఓపీఆర్‌డీ దాస్, యోగనంద, సర్పంచ్ పరమేశ్వర, పంచాయతీ కార్యదర్శులు శివన్న, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ఉరవకొండ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది పిలుపునిచ్చారు. గురువారం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్‌పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం పట్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, ప్రాణాపాయ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'కిద్మత్ ఏ ఖల్క్'కు దాతలు సహకరించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఉన్నత చదువులు చదువుతున్న పేద ముస్లిం విద్యార్థుల చేయూత కోసం ఏర్పాటు చేసిన 'కిద్మత్ ఏ ఖల్క్' ట్రస్ట్‌కు దాతలు సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు. దాత షబ్బీర్ కుమారుడు లుక్మాన్ గురువారం ట్రస్ట్‌కు తన వంతుగా రూ.3 వేలు ఆర్థిక సాయం అందించాడు. వచ్చే ఏడాది నుంచి పేద ముస్లిం విద్యార్థులకు ఆర్థిక సాయం చేయనున్నట్లు రఫీక్, దాదు, అబుబక్కర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను అరికడదాం

కళ్యాణదుర్గం రూరల్: నాటుసారాను పూర్తిగా అరికడదామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, నవోదయ 2.0 అమలు చేయటానికి గ్రామసభలు నిర్వహించి ప్రజలు చైతన్య వతం చేయాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రామ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్: పాపంపల్లి గ్రామంలో రైతు రామాంజనేయులు సాగు చేసిన రెండెకరాల మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నిప్పుపెట్టారు. రూ.60 వేలు నష్టం వచ్చిందని రైతు రామాంజనేయులు తెలిపాడు.

నేటి నుంచి పప్పుశనగ కొనుగోళ్లు ప్రారంభం

కణేకల్లు: మండలంలో రైతులు పండించిన పప్పుశనగ ఉత్పత్తులను శుక్రవారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు ఏఓ శ్రవణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా రబీసీజన్‌లో 9,461 హెక్టార్లలో శనగపంట సాగైందన్నారు. క్వింటా ధర రూ.5,650తో కొనుగోలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకెళ్లి పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

వజ్రకరూరు: రైతుల నుంచి మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏఓ మధుకర్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. క్వింటా ధర రూ.5,650తో కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

విజ్ఞాన,విహార యాత్రకు 13 మంది ఎంపిక

బెళుగుప్ప: మండలంలోని ఉన్నత పాఠశాల, కోనంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 13 మంది విజ్ఞాన, విహార యాత్రలకు ఎంపికయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్ఎం వెంకటప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెళుగుప్ప ఉన్నత పాఠశాల నుంచి 8,9 తరగతుల విద్యార్థులు యశ్వంత్, ఎం.యశ్వంత్, మునేశ్వర్ సాయి, అర్చన, ఐశ్వర్య, నిఖిత, అనుశ్రీ, మేఘనాబాయ్, ఉషశ్రీ, కోనంపల్లి విద్యార్థులు జయ్‌పాల్, గురుప్రకాశ్, మాన్యశ్రీ, ప్రణీత ఎంకయ్యారు.

పిచ్చుకలను రక్షించుకుందాం

కళ్యాణదుర్గం: పర్యావరణంలో భాగమైన పిచ్చుకలను రక్షించుకుందామని ఉపాధ్యాయుడు రాజన్న తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో జన విజ్ఞాన వేదిక కార్యకర్త, స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజన్న ఆధ్వర్యంలో పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుకున్నారు. గ్రామస్తులు వీరేష్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ పరిశీలన

శెట్టూరు: మండలంలోని ములకలేడులో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి గురువారం పరిశీలించారు. హాస్టల్ గదుల నాణ్యత, స్థలం ఇతర సదుపాయాలపై అధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

26న బహిరంగ వేలం

కూడేరు: ఈనెల 26న కూడేరు జోడులింగాల ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయ దుకాణం, సప్లయర్స్‌షాపు నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ బాబు గురువారం తెలిపారు.

శ్మశాన స్థలాన్ని కాపాడండి

కంబదూరు: మండలంలోని ములకనూరులో క్రైస్తవులకు కేటాయించిన శ్మశాన స్థలంలోని సమాధులను నారాయణ అనే వ్యక్తి జేసీబీతో ధ్వంసం చేసి ఆక్రమించాడని చర్చి పాస్టర్, క్రైస్తవులు తహసీల్దార్ బాలకిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. క్రైస్తవుల శ్మశాన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలో సీఎం చంద్రబాబునాయుడు హామీ మేరకు జరుగుతున్న సీసీ రోడ్ల పనులను డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్ గురువారం పరిశీలించారు. గ్రామంలో రూ.3 కోట్లు నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.